పుల్మోసిల్ నకిలీ ఇంజెక్షన్లలో ఫంగస్

అమ్మకాలను నిలిపివేయాలని డీసీఏ నోటీసులు

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): అంగస్తంభన సమస్యలను నయంచేసే పుల్మోసిల్ ఇంజెక్షన్లలో నకిలీ వెర్షన్ అమ్మకాలు జరుగుతున్నట్టు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు కనుగొన్నారు. హైదరాబాద్ శివారు తుర్కపల్లిలోని సన్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో ఈ నకిలీ వెర్షన్ తయారైనట్టు గుర్తించారు. బ్యాచ్ నంబర్ కేఏఫ్ఏ 0300, మాన్యుఫ్యాక్చరింగ్ డేట్ 06/23తో ఉన్న 10 ఎంజీ/12.5 ఎంఎల్ పుల్మోసిల్ ఇంజెక్షన్లలో ఫంగస్ ఉన్నట్టు తేలడంతో.. వాటి అమ్మకాలను నిలిపివేయాలని విక్రేతలకు నోటీసులు జారీ చేశారు.

హైకోర్టు ఆదేశించినా కనికరించరా?

- కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో అన్యాయంపై ఏడుగురు అభ్యర్థుల ఆవేదన
- గడువు సమీపిస్తున్నా మెడికల్ టెస్టులు నిర్వహించని బోర్డు అధికారులు
- ఇదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్న వైనం

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో అన్యాయానికి గురైన కొందరు అభ్యర్థులకు మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాలను తెలంగాణ పోలీసు నియామక బోర్డు పట్టించుకోవడం లేదు. ఇదేమిటని అడిగితే బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. దీనిపై ఆ అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ ఏడాది ఫిబ్రవరి 14న అపాయింట్‌మెంట్ లెటర్లు అందించాలనే ఉద్దేశంతో వారికి బోర్డు అధికారులు ఆదరాబాదరాగా మెడికల్ టెస్టులు చేయించారు. వారిలో కొందరికి ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించకుండా కేవలం కండ్లతో చూసి ఉద్యోగాలకు 'అన్‌ఫిట్' అని తేల్చడంతో.. 'ఆ పోలీసు అభ్యర్థులు అన్‌ఫిట్?' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ అన్యాయంపై ఏడుగురు బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వారికి అనుకూలంగా ఏప్రిల్ 29న తీర్పు వచ్చింది. వారికి మళ్లీ గాంధీ లేదా ఉస్మానియా దవాఖాన వైద్యులతో 4 వారాల్లోగా మెడికల్ టెస్టులు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ తీర్పు వచ్చి దాదాపు 20 రోజులు కావొస్తున్నా రాష్ట్ర పోలీసు నియామక బోర్డు నుంచి ఎలాంటి స్పందన లేదని ఆ అభ్యర్థులు వాపోతున్నారు. దీనిపై బోర్డు అధికారులను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. హైకోర్టు తీర్పు కాపీ తమకు ఇంకా అందలేదని చెప్పారు. హైకోర్టు ఇచ్చిన గడువు సమీపిస్తున్నప్పటికీ వైద్య పరీక్షలు చేయాల్సింది తాము కాదని, వైద్యులే చేయాలని ఓ అధికారి నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో తమకున్న చివరి అవకాశం కూడా చేజారి పోతుందేమోనని ఆ అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. కాగా, ఈ అభ్యర్థుల పిటిషన్‌పై జూలై 10న తుది తీర్పు వెలువడనున్నది.

ప్రియురాలు పైసా వసూల్

ప్రియుడి ఆత్మహత్యాయత్నం

- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో ఘటన

నాగరాజుతో ప్రియాంక

తిమ్మాపూర్, మే18: ప్రేమ పేరిట ఓ యువతి యువకుడికి లక్షల రూపాయలు టోకరా పెట్టింది. ఆ డబ్బులతో బంగారు ఆభరణాలు కొనుక్కొని వాటితో విదేశాలకు ఉడాయించింది. అంతేకాదు.. ఆ యువ కుడికి వారసత్వంగా వచ్చే భూమిని తన పేరుపై రాసిస్తేనే పెండ్లి చేసుకుంటానంటూ అక్కడి నుంచి పదేపదే ఫోన్ చేసి వేధించింది. ఇందుకు మనస్తాపం చెందిన ప్రియుడు ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. తిమ్మాపూర్‌కు చెందిన మాదన నాగరాజు డీ ఫార్మసీ చదువుతూనే గతేడాది కోయంబత్తూర్‌లో ఇషా ఫౌండేషన్‌లో పనిచేశాడు. అక్కడే వైజాగ్‌కు చెందిన కమల సంధ్య ప్రియాంక పరిచయం అయింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇంతలోనే ఆస్ట్రేలియాకు వెళ్లిన ఆ యువతి.. తనకు డబ్బులు పంపిస్తే ఇండియాకు వచ్చి పెండ్లి చేసుకుంటానని చెప్పింది. దాంతో నాగరాజు ఆమె చెప్పిన విధంగా చంద్ర శ్రీనివాస్‌రావుకు ఫోన్ పే ద్వారా రూ.లక్ష పంపాడు. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రియాంక నేరుగా తిమ్మాపూర్‌లోని నాగరాజు ఇంటికి వచ్చింది. పెండ్లి కాకపోవడంతో ఆ యువతి ఇంటికి రావడాన్ని నాగరాజు కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇద్దరూ కలిసి తిమ్మాపూర్‌లోనే ఓ అద్దె ఇంట్లో నెలరోజులపాటు ఉన్నారు. ఈ క్రమంలో నాగరాజు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో తనకున్న భాగస్వామ్యాన్ని వదులుకుని రూ.16 లక్షలు తీసుకున్నాడు. ఆ నగదును ప్రియాంక తన సోదరి ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నది. ఆ తర్వాత వైజాగ్ వెళ్లిన ఇద్దరూ బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. మూడు నెలలపాటు అక్కడే కలిసి ఉన్నారు. అనంతరం ఆమె బంగారు నగలతో ఆస్ట్రేలియాకు ఉడాయించింది. తిమ్మాపూర్‌లోనే ఉంటున్న నాగరాజుకు యువతి పదే పదే ఫోన్ చేస్తూ.. 'నన్ను పెండ్లి చేసుకోవాలంటే నీ వాటా కింద వచ్చే రెండెకరాల భూమిని నా పేరుమీద రాసివ్వాలని' వేధించింది. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. నాగరాజు తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు సంధ్య ప్రియాంకతోపాటు శ్రీనివాస్‌రావుపై కేసు నమోదు చేసినట్టు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు.

అన్ని క్యాటగిరీలకు సరిపడా విద్యుత్

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ డిస్కమ్‌లు అన్ని క్యాటగిరీల వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించడానికి 24/7 శ్రమిస్తున్నాయని టీఎస్ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ అంతరాయాలు నాలుగైదుసార్లు జరుగుతున్నాయనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు.



కళ్యాణమస్తు
..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బం